# ఎగరేయి నీజెండా

అదో చిన్న పట్టణం. తూర్పు వీధిలో పోస్టాఫీసు దాటిన తరువాత మూడో ఇల్లు చూస్తారు మీరు. అది జీర్ణావస్థలో ఉన్న పెంకుటిల్లు. ముందు వైపు ప్రహరీ కూలి పోయిఉంది. ఇంటి మీద పెంకులు కొన్ని అక్కడక్కడా లేచి పోయి ఉన్నాయి. అయినా ఆ ఇంట్లో అరడజను మంది కాపుర ముంటున్నారు. ఎండొచ్చినా, వానొచ్చినా అన్నిటికీ అతీతంగా ఏ భావాలూ ముఖం మీద కనిపించకుండా జీవిస్తున్నారు.

ప్రస్తుతం ఆ ఇంటి ముందు వాలు కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు ఓ అరవై ఏళ్లాయన. ఆయనే ఆ ఇంటి యజమాని పరంధామయ్య. రెండేళ్ల క్రితం ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టరుగా రిటైరయ్యాడు. ఆయనకు రిటైర్‌మెంటు బెనిఫిట్సు యాభైవేలు దాకా వచ్చాయి. నెలకు నాలుగొందలు పింఛను వస్తుంది. అతను యాభైవేలు బ్యాంకులో వేసి దాని వడ్డీతో, పింఛనుతో రోజులు నెట్టుకు వస్తున్నాడు.

పరంధామయ్యకు నలుగురు సంతానం. రమ, ఉమ, మల్లిక, కొడుకు జయరాం, మొదటి ఇద్దరు పెళ్లికి ఎదిగి ఉన్నారు. రమ బి.ఎ. వరకూ చదివి ఉద్యోగం దొరక్క మొగుడు కోసం ఎదురుచూస్తూ కాలక్షేపానికి ట్యూషన్లు చెబుతోంది.

ఇక రెండోది ఉమ. మొదటి సంవత్సరం బి.యస్సీ. పూర్తిచేసి, రెండో సంవత్సరం బి.యస్సీ. ఫీజులు కట్టాల్సిన సమయానికి పరంధామయ్య రిటైరయి పోయాడు. తనవల్ల కాదని చేతులు ఎత్తేసాడు. దాంతో ఆమె చదువు మాని టైపు నేర్చుకుంటోంది.

ఇక పోతే మల్లిక జూనియర్ ఇంటర్ చదువుతోంది. కొడుకు జయరాం. ఒక ప్రభుత్వ సంస్థలో టెంపరరీ టైపిస్టుగా పనిచేస్తున్నాడు.

పరంధామయ్య ఉద్దేశ్యం తన దగ్గరున్న డబ్బుతో పెళ్ళికెదిగి గుండెల మీద కుంపట్లులా తయారైనా ఇద్దరు పెద్దకూతుళ్ళకు చెరో పాతిక వేల కట్నంతో పెళ్ళిళ్లు చేసి ఆ బాధ్యత నెరవేర్చుకోవాలని ఉంది. గత రెండేళ్లుగా ఆ వరుళ్ల వేటలో కొంత అనుభవాన్ని సంపాదించుకున్నాడు.

ఇదుగో ఇప్పుడు చూడండి పరంధామయ్య వయస్సున్న ఒక పెద్దమనిషి గేటు లేని ప్రహరీ దాటుకుని ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించాడు. యధాలాపంగా తలెత్తి వీధి వైపు చూసిన పరంధామయ్య ఒకటికి రెండు సార్లు కళ్లు చికిలించుకుని చూసాడు.

తరువాత ఆనందంగా లేచి నిలబడి "అరె శంకరయ్యా. నిన్నరాలేదేం" అన్నాడు. అప్పటికే ఆ వ్యక్తి వరండా మెట్లెక్కి పరంధామయ్య కెదురుగా నిలబడ్డాడు.

"కూర్చో" అంటూ ఎదురు కుర్చీ చూపించాడు పరంధామయ్య.

ఇంతలో ఆ సంభాషణను విన్న పరంధామయ్య ధర్మపత్ని జయమ్మ మంచి నీళ్ల గ్లాసుతో లోపలినుంచి వచ్చింది.

"అన్నయ్యా అంతా బాగున్నారా" అంటూ పరామర్శించింది.

అంతా బాగానే ఉన్నారని తలాడించాడు శంకరయ్య. రెండు కుటుంబాలూ ఒకే ఊళ్ళో ఉన్నా వాళ్ళింటికి పోయినపుడు వాళ్లు అలా అడగడం, వీళ్లింటికి వచ్చి నపుడు వీళ్ల ఇలా అడగడం మామూలే.

పరంధామయ్య సస్పెన్సు భరించలేక "ఇంతకీ ఏమయిందిరా. కాయా? పండా?" అని అడిగాడు.

జయమ్మ ఖాళీ గ్లాసు ఒక చేతిలో పట్టుకుని శంకరయ్య జవాబుకోసం నిలబడింది.

కానిశంకరయ్య మౌనంగా ఉండిపోయాడు. దానర్థం అనకొన్న పని కాయనే అందరికీ తెలుస్తోంది. కాని అదేదో శంకర్య నోటంట వింటే అదో ఇది. శంకరయ్య ఉన్నట్టుండి పండంటాడేమోనని వాళ్ల గుడ్డి నమ్మకం.

మొన్న శంకరయ్యకు తెలిసిన వాళ్లు ప్రక్కూరు నుండి వచ్చి రమను చూసుకు వెళ్లారు. ఏ విషయం శంకరయ్య చేత చెప్పంపుతామని అన్నారు. అందుకే శంకరయ్య రాకకోసం అంత ఆతృతగా ఎదురు చూస్తున్నాడు పరంధామయ్య.

శంకరయ్య ఉన్నట్టుండి జేబులోంచి ఒక అడ్రసుతీసి "ఒరే ఇతను పెళ్లిళ్ళ పేరయ్య. మనం ఇక ఎక్కడికీ కాళ్లకు బలపాలు కట్టుకొని తిరగనక్కర్లేదు. ఈ ఊరికి వెళ్ళి ఇతన్ని కలుసుకున్నామంటే అతను మనకి ఒకే రోజులో నీ ఇద్దరు కుమార్తెలకు నీ స్థాయికి తగ్గ సంబంధాలు కుదురుస్తాడు" అంటూ పరంధామయ్యకు చూపించాడు.

"అంటే మొన్నటి సంబంధం...."

"ఎగిరి పోయినట్లే అనుకో. వాళ్లకు ముప్పయివేలు కట్నం, పదిసవర్లు బంగారు కావాలట. ఒక పిల్లకే అంతిస్తే రెండో పిల్ల మాటేమిటిరా"

పరంధామయ్య నిస్పృహగా కుర్చీలో ఒదిగిపోతే జయమ్మ చేతిలోని స్టీలు గ్లాసు అప్రయత్నంగా జారి క్రింద గచ్చు మీదపడి 'టంగ్... టంగ్... టంగ్...' మని దొర్లుకుంటూ పోయి గోడకానుకుని ఆగిపోయింది.

"రేయ్. బాధపడకురా. ఎల్లుండే మనం అక్కడికి వెల్దాం..." పరంధామయ్య చేతి మీద చేయివేస్తూ అనునయంగా అన్నాడు శంకరయ్య.

కథా నిలయం
5733
శ్రీకాకుళం

పరంధామయ్య కళ్లు తెరచి "ఒరే ఎన్నోసార్లు ఇటువంటి వార్తలు విన్న నాకు ఈ బాధ ఒక్క నిముషమే. నువ్వన్నట్లు ఎల్లుండి వెల్దాం" అన్నాడు స్నేహితుడి చేతిని తనచేతిలోకి తీసుకుని.

ఇంతలో "మామయ్యా కాఫీ" అంటూ ట్రేలో రెండు కాఫీ కప్పులు పెట్టుకుని వచ్చింది రమ.

కప్పు అందుకుంటూ "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అంటూ చేయెత్తి ఆమెను దీవించాడు.

"నాకేం అంత తొందరలేదులే" గొణిగింది రమ.

కాఫీ త్రాగి లేచి నిలబడ్డాడు శంకరయ్య. " ఉమ ఏదీ ఒక సారి చూసి పోతాను" అన్నాడు.

లోపల ఇనిస్టిట్యూట్‌కు పోవడానికి కాగితాలు తీసుకుంటున్న ఉమ ఈ మాటలు విని వరండాలోకి వచ్చి "నమస్కారం మామయ్యా" అంది రెండు చేతులూ జోడించి.

ఆమెను కూడా "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అంటూ దీవించాడు.

తన కెదురుగా ఏపుగా ఎదిగి ఎర్రగా మిసమిస లాడుతూ పంచకళ్యాణి గుర్రాల్లా ఉన్న ఇద్దరినీ "ఒక్కనెల ఆగండి" అంటూ చిరునవ్వు నవ్వి, కూతుర్ల సిగ్గుకు మురిసిపోతున్న జయమ్మకు, 'నీవన్నట్లు జరిగితే నీకు జీవితాంతం కృతజ్ఞతగా ఉంటానురా' అని ఊపిరి బిగపట్టి చూస్తున్న పరంధామయ్యకు వెళ్లొస్తానని చెప్పి బయలు దేరాడు శంకరయ్య.

• • • • • • • • •

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో దిగి, కాళ్లీడ్చుకుంటూ దగ్గరలో ఉన్న బస్ స్టాండుకు వచ్చారు మిత్రులిద్దరూ. అక్కడ్నుంచి వాళ్లు వెళ్లాల్సిన ఊరుకు ఒకే ఒక బస్సుందట. అది ఉదయం ఒకసారి వెళ్లి మళ్లీ సాయంత్రమే తిరిగి వస్తుందట.

పరంధామయ్యకు ఆ ఊరిపేరు గుర్తులేదు. పరంధామయ్యకు తెలుసుకోవాలన్న ఆతృత కూడా లేదు. ఉపాధ్యాయుడి వెనుక నడిచే విద్యార్థిలా నోరెత్తకుండా శంకరయ్య వెంట నడుస్తున్నాడు.

ఇంతలో డబడబ మని శబ్దం చేసుకుంటూ పెయింటు రాలిపోయి పేర్లు చెదిరిపోయిన బి.సి కాలం బస్సొకటి వచ్చి ఆగింది.

అది ఆగీ అగగానే 'జెండాలూరు, జెండాలూరు' అంటూ గాడిద ఓండ్రపెట్టినట్లు అరుస్తున్నాడు కండెక్టరు. విసరేసిన విత్తనాల్లా అక్కడక్కడా కూర్చుని ఉన్న జనం పరుగెత్తుకు వచ్చి కోతుల్లా కిటికీల్లోంచి దూరి తమ సీట్లు రిజర్వు చేసుకుంటున్నారు.

“ఒరేయ్ పదపద ఇదే మన బస్సు” అంటూ శంకరయ్య పరుగెత్తుకుంటూ వెళ్లి కిటికీలోంచి తన భుజాన ఉన్న తుండుగుడ్డను పొడవుగా పడేట్లు విసరి రెండు సీట్లు రిజర్వు చేసాడు.

తరువాత అతి కష్టం మీద ఇద్దరూ బస్సులో ప్రవేశించారు. ఇప్పుడిప్పుడే బయలు దేరుతున్నట్లు నటించి చివరకు గంట తరువాత బయలు దేరింది బస్సు. మెయిన్ రోడ్డులోంచి చీలి ఒక మట్టి రోడ్డున పడి దుమ్మురేపుకొంటూ పోతూ ఉంది. దారిలో ఎన్నో కొండలు, గుట్టలు దాటి పోతూ ఉంది. తమాషా ఏమిటంటే నెల్లూరులో బయలుదేరిన బస్సు ఎక్కడా ఆగలేదు. అలా అరవై కిలోమీటర్లు మట్టి రోడ్డుమీద ప్రయాణించింది.

“అదుగో జెండా” చుట్టూ కొండలమధ్య సగర్వంగా ఎగురుతున్న జెండాను చూస్తూ ఆశ్చర్యంగా అరిచాడు పరంధామయ్య. అంతపెద్ద జెండా అతనెప్పుడూ చూడ్లేదు.

“అదే జెండాలూరు” అన్నాడు శంకరయ్య. కొద్దిసేపట్లో చుట్టూ అరుగు మధ్యలో పెద్ద వేపచెట్టుకు ఎత్తుగా కట్టి ఉన్న జెండా దగ్గర ఆగింది బస్సు. బిలబిలామంటూ బస్సులోంచి దిగారు జనం.

వేపచెట్టు నీడలో అగురుమీద దాదాపు పదిమంది పురోహితులు కూర్చుని ఉన్నారు. వాళ్లంతా ప్రయాణీకులను చుట్టుకొని ‘నాతోరండి’ ‘నాతోరండి’ అంటూ తిరుపతిలో కొత్త భక్తుల్ని బోల్తా కొట్టించే నకిలీ పూజారుల్లా పిలుస్తున్నారు.

శంకరయ్య చేయి పట్టుకుని వాళ్లలోంచి బయటపడ్డాడు పరంధామయ్య. ఇద్దరూ వీధి వెంట నడుస్తున్నారు. ప్రతి ఇంటిమీద ఒక్కో తెల్లజెండా ఎగురుతోంది. కొన్ని ఇళ్లలో రెండు, మూడు, నాలుగు కూడా ఉన్నాయి. అందులో ఇళ్లమీద కట్టి ఉన్న జెండాలు రకరకాల ఎత్తుల్లో ఉన్నాయి. అయిదడుగుల ఎత్తునుంచి ఆరువందలు అడుగుల ఎత్తువరకు ఉన్నాయి. వాటి మీద ఏవేవో వ్రాసి ఉన్నాయి.

ఇంతవరకు సస్పెన్సు భరించిన పరంధామయ్య ఇక ఉండ బట్టలేక పోయాడు. నడుస్తున్నవాడల్లా ఆగి “శంకరయ్యా అంతా మాయగా ఉంది. నెల్లూరులో బస్సెక్కిన ప్రయాణీకులంతా యాత్రికుల్లా ఈ జెండాలూరు రావడమేమిటి. ఇక్కడ ఇండ్లమీద రకరకాల ఎత్తుల్లో రకరకాల సైజుల్లో జెండాలుండడమేమిటి? మనం వచ్చింది అమ్మాయిలకు సంబంధాలు మాట్లాడటానికా లేక తీర్థయాత్రలకా. అయినా ఈ పుణ్యక్షేత్రం పేరు ఇప్పటి వరకు వినలేదు గదరా” అన్నాడు..

"పరంధామయ్యా, ఓ పదినిమిషాలూరుకో. అంతా నీకు అర్థమవుతుంది. వీలున్నంత వరకు ఆ జెండాలమీద ఏముందో చదవడానికి ప్రయత్నించు" అంటూ తాత్కాలికంగా అతన్ని శాంతింప జేసాడు.

పరంధామయ్య మౌనంగా ఆ జెండాల మీద ఉన్నది చదువుతూ నడుస్తున్నాడు.

బి.జి.-ఎ.ఇ-75 : బి.జి. యం.డి.150 : బి.జి., జె.ఎ. /డా / 2 యం.బి.బి.యస్. - 125 : బి.జి స్పే.-5 ఇట్లా ఉన్నాయి. సంఖ్య ఎక్కువ తక్కువలను బట్టి జెండాల ఎత్తులు కూడా మారుతున్నాయి. ఏమిటీ కోడ్. అంతా కంప్యూటర్ ఫిగర్స్‌లా ఉన్నాయే అనుకున్నాడు.

ఏదో అడగబోయేలోగా "ఇదే ఇల్లు" అన్నాడు శంకరయ్య. ఇద్దరూ వీధిగేటు తీసుకుని లోపలికి వెళ్లారు. లోపలి పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నాడు ఒక పండు ముదుసలి. అతని ప్రక్కన కొన్ని పుస్తకాలున్నాయి. అతని కెదురుగా ఓ నలుగురు కూర్చుని ఉన్నారు.

వీళ్ళను చూడగానే పండు ముదుసలి చిరునవ్వు నవ్వి, "ఎన్నాళ్ళకు చూసాను శంకరయ్యా. ఇద్దరూ లోపల కూర్చోండి. పదినిముషాల్లో వీళ్ళని పంపించి వస్తాను" అన్నాడు.

ఇద్దరూ లోపలికి వెళ్లి కూర్చున్నారు. ఒక ముసలామె రెండు గ్లాసులతో నీళ్లు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. ఈమె అతని భార్య కాబోలు అనుకున్నాడు పరంధామయ్య.

ఇంతలో శంకరయ్య "నే చెప్పానే పెళ్లిళ్ల పేరయ్యని, ఇతనే. రామనాథశాస్త్రి. ఆయన దగ్గరున్న పుస్తకంలో చాలా అడ్రసులున్నాయి. మనకు కావలసిన సంబంధం తప్పక దొరుకుతుంది. బయట కూర్చున్న పెద్దమనుషులు కూడా అపని మీద వచ్చిన వాళ్లే" అన్నాడు.

పదినిముషాల తర్వాత రామనాథశాస్త్రి బట్టతల తడుముకుంటూ పిలక నిమురుకుంటూ లోపలికొచ్చాడు. రాగానే ఇద్దరి కెదురుగా ఉన్న వాలుకుర్చీలో కూర్చున్నాడు.

ఇద్దర్నీ కుశల ప్రశ్నలు వేసాడు. రామనాథశాస్త్రికి శంకరయ్యకు ఏదో దూరపు బంధుత్వం ఉంది. తరువాత తాము వచ్చిన పని చెప్పాడు శంకరయ్య.

"అరె అదెంత పని. ఇంతకీ మీరు సెలెక్టు చేసుకున్న జెండాల వివరాలివ్వండి" అన్నాడు పుస్తకం తెరుస్తూ.

"జెండాలేమిటి? వివరాలివ్వడమేమిటి ముందే అర్థంగాక చస్తుంటే" సహనం చచ్చి కొద్ది విసుగ్గా అన్నాడు పరంధామయ్య.

"అయితే జెండాలూరు సంగతి మీకు తెలియదన్నమాట" ఈ సారి ఆశ్చర్యంగా నోరు తెరిచాడు రామనాథశాస్త్రి.

శంకరయ్య, పరంధామయ్య మౌనంగా ఉండిపోయారు.

"అయితే చెబుతాను వినండి. ఇది ఒక పుణ్య క్షేత్రమూకాదు. చారిత్రాత్మక ప్రదేశమూ కాదు. కాని అంతకంటే గొప్పది. ఎంతో విలువయినదీ. జి.యన్.టి. రోడ్డుకు పడమరగా అరవై కిలోమీటర్ల దూరంలో కొండలు మాటున నిర్మించిన ఈ నగరం యొక్క అంతరార్ధ మేమిటో బయటి ప్రపంచానికి తెలియదు. రహస్యంగా తెలుసుకుంటే తప్ప" గాలి పీల్చుకున్నాడు రామనాథశాస్త్రి.

"....ప్రస్తుత్తం వరకట్నం ప్రభుత్వం నిషేధించింది. చట్ట ప్రకారం వరకట్నం తీసుకున్న వాళ్లు శిక్షార్హులు. కనుక కట్నం తీసుకోకూడదు. ఆ పరిస్థితుల్లో ఒక మహామేధావి ఆలోచనలకు ప్రతిరూపమిది. ఆయనకు ఆరుగురు కొడుకులున్నారు. అంతా పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. కట్నం తీసుకోవాలంటే భయంగా ఉంది. కారణం ఆయన లోకం దృష్టిలో గొప్ప సంఘసంస్కర్త. ఇంత పెద్ద సంఘ సంస్కర్త తన కొడుకులకు కట్నం తీసుకుంటే ప్రజలు హర్షించరుగదా. తన సోషల్ ప్రిస్టేజి కాపాడు కోవాలి. దాంతో బాటు భారీ ఎత్తున కట్న కానుకలూ తీసుకోవాలి. అందుకే తనలాంటి కొందరితో కలసి ఈ విషయం ఆలోచించి అందరూ కలసి ఇక్కడ చిన్న చిన్న ఇండ్లు కట్టించి ఒక్కో ఇంటి మీద ఒక్కో జెండా ఎగుర వేయించి దాని మీద వరుడి చదువు, ఉద్యోగం, రావలసిన కట్నం ముద్రించారు.

వీరి అడ్రసులు మరుగున పెట్టి కేరాఫ్ అడ్రసుతో పత్రికలలో బాక్సులు తీసుకుని వధువుకావలెను, అని పత్రికలలో ప్రకటనలు వేయించారు. ప్రకటనలలో కట్నం ప్రసక్తిలేదు. గతంలో జెండాలూరు ప్రక్కనే కోయవాళ్ల పల్లె ఒకటుండేది. మొదటగా నన్ను, నాకు తోడుగా ఇంకో ఇద్దరు పురోహితుల్ని ఇక్కడ ఉంచారు. అంతే పత్రికలకొచ్చిన కేరాఫ్ అడ్రసులతో వాళ్లు ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడ మనీ డీలింగ్సు జరిగేవి. క్రమేణా జెండాలు పెరిగి పోయాయి. పురోహితులూ ఎక్కువయి పోయారు. సంబంధాలకోసం ఇక్కడికొచ్చేవాళ్లూ ఎక్కువయ్యారు..." గాలి పీల్చుకున్నాడు.

"అయితే నేను కొన్ని జెండాలు చూసాను" అంటూ తను చూసిన జెండాల గురించి చెప్పాడు పరంధామయ్య.

"బి.జి.ఎ.ఇ.-75, అంటే బ్రైడ్‌గ్రూమ్ అంటే వరుడు అసిస్టెంటు ఇంజనీరు, కట్నం డెబ్బయి అయిదువేలు అని, బి.జి.డా.యం.డి.-150 అంటే వరుడు డాక్టరు డిగ్రీ యం.డి. అతనిరేటు లక్షా యాభైవేలు అని, బి.జి.జె.ఎ.$_2$-50 అంటే రెండవ పెళ్లివాడని మరుడి రేటు యాభైవేలని, బి.జి.స్వీ - 5 అంటే వరుడు స్వీపరు. రేటు అయిదువేలని దీనర్థం. ఇవి కట్నాల రేటన్నమాట. ప్రతి జెండాకు సీరియల్ నంబరుంటుంది. అది ముఖ్యం. దాంతో పుస్తకంలోని వరుని అడ్రసు వెరిఫై చేయడం చాలా తేలిక"

జెండాల మీదున్న పదాల అర్థం తెలుసుకున్న శంకరయ్య, పరంధామయ్య అవాక్కయి పోయారు. ఆ మధ్యాహ్నం రామనాథశాస్త్రి ఇంట్లో భోంచేశారు. శంకరయ్య తాహతు తెలుసుకున్న రామనాథశాస్త్రి పుస్తకాలు తిరగేసి రెండు సంబంధాలు చెప్పాడు. ఒకటి పి.డ.బ్ల్యు.డి. ఆపీసులో టైపిస్టు ఇరవై వేల రుపాయలు, మరొకటి మునిసిపాలిటీ ఆఫీసులో గుమాస్తా ఇరవై అయిదు వేల రూపాయలు.

"ఇవి దివ్యమైన సంబంధాలు. ఇంటికి వెళ్లి మాట్లాడుకుని ఉత్తరం వ్రాయి. నీ ఉత్తరం అందిన పదిరోజుల్లో మంచి రోజు చూసుకొని వాళ్లు వచ్చే ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు రామనాథశాస్త్రి పుస్తకం మూస్తూ.

పరంధామయ్య ఇష్టపడ్డట్లు తల ఊపాడు. ఆ సాయంత్రం బయలు దేర బోతుంటే అన్నాడు రామానాథశాస్త్రి "పరంధామయ్యగారూ కుమారుడు ఏం చేస్తున్నాడు."

"టెంపరరీ టైపిస్టుగా పనిచేస్తున్నాడండీ"

"ఇకేం మీరూ ఒక జెండా ఎగరేయండి"

"నాకు ఇష్టంలేదు శాస్త్రి గారూ"

"ఇష్టంలేక పోవడమేమిటండీ. దీని వల్ల భవిష్యత్తులో ఎంత ఉపయోగమో మీకు తెలియదు" అంటూ బలవంతంగా పరంధామయ్యను జెండా రిజిస్ట్రారు ఆఫీసుకు తీసుకువెళ్లి అతని కొడుకు పేరు రిజిష్టరు చేయించాడు. సీరియల్ నెంబరు ఇరవై అయిదు వేల తొమ్మిది వందలా ముప్పయి ఒకటి అతనిది.

అంతే. గాలిలోకి ఇంకోజెండా లేచింది. దానిమీద బి.జి.టెం.టై.-10 అని ఉంది.

పరంధామయ్య ఇంటికొచ్చి భార్యకు, పిల్లలకూ విషయమంతా చెప్పాడు. అతని భార్య ఎంతో సంతోషించింది. కాని రమ, ఉమ నిర్ఘాంతపోయారు. జరిగిందంతావిని అతని కొడుకు జయరాం తన పేర జెండా ఎగరేసినందుకు విరుచుకు పడ్డాడు. మరునాడు రామనాథశాస్త్రికి ఉత్తరం వ్రాసి జెండా తీసి వేయించగలనని తండ్రి చెప్పిన తరువాత గాని అతను శాంతించలేదు.

కాలం తన గమనంలో ఇరవై ఒకటవ శతాబ్దం చేరుకుంది. ఆడపిల్లలు కట్నంతో పెళ్లిచేసుకోమని భీష్మించటం వల్ల మగపిల్లలకు కట్నం లేకుండా చేసుకోవడం తప్పని సరైంది. దైనందిన జీవితంలో ఒకరికొకరు పరస్పరం అవసరం మరి. క్రమేణా అమ్మాయిలకు డిమాండ్ ఏర్పడి పోయింది. ఆడిమాండులో అందమైన అమ్మాయిలకు పోటీలమీద ఎదురు కట్నమిచ్చి మగవాడు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

భూమి గుండ్రంగా తిరగడం వల్ల పగలు, రాత్రి ఏర్పడినట్లే సమాజంలో కూడా ఈ నాటి పరిస్థితులు, పద్ధతులు ఒకనాటికి పాతబడి, ఒకనాటి పాత పద్ధతులుపై ఈనాడు మోజు పెంచుకొనడం అలవాటు. అందుకే ఒకనాటి కన్యాశుల్కం పద్ధతి ఇరవై ఒకటవ శతాబ్దం వచ్చేసరికి యధాతథంగా వచ్చి కూర్చుంది. ఇది కొంతకాలం మాత్రమే. మళ్లీ కొంతకాలానికి వరకట్నం పద్ధతి రావచ్చేమో. మరి వరకట్న మిచ్చినా, కన్యాశుల్కం ఇచ్చినా అర్థం ఒక్కటే ✷

**(వనిత మంత్లీ, అక్టోబరు, 1991)**